క్లుప్తంగా

అభినందన



ఉజ్వలను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: గ్రూప్–1 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన పట్టణానికి చెందిన ఉజ్వలను ఆదివారం ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. పట్టణంలోని తిరుమల కాలనీలో నివాసం ఉంటున్న పద్మనాభం లక్ష్మీదేవి దంపతుల కూతురు ఉజ్వల గ్రూప్–1 పరీక్షలో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి ఆమెను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరింత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జూపల్లి కౌసల్య, శంకర్, పిల్లి శారద, శేఖర్, నాయకులు దినేశ్‌సాగర్, రాఘవేందర్, హరికృష్ణ, రమేశ్‌గౌడ్, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డి, పోమాల్‌పల్లి గ్రామాల గుట్టపై గల శివాలయం పునర్నిర్మాణానికి నాయకులు ఆదివారం భూమిపూజ చేశారు. రూ.5 లక్షలతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ కంచుకోట సత్యనారాయణ, నాయకులు, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, బాల్‌రాజ్, వేణు, రమేశ్, నర్సింహ, వెంకటేశ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బుకుంటకు జలకళ



మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామ సమీపంలో గల అబ్బుకుంటకు జలకళ సంతరించుకుంది. కురుస్తున్న వర్షాలతో వరదనీరు కుంటలోకి భారీగా చేరింది. దీంతో చుట్టు పక్కన ఉన్న పంట పొలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



భీంభరత్‌తో పట్టణ నాయకులు

శంకర్‌పల్లి: పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ సూచించినా అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇతర పార్టీల వారికి అవకాశం ఇవ్వకూడదన్నారు. వచ్చే మూడేళ్లు పార్టీ అధికారంలో ఉంటుంది కాబట్టి, పదవులు అందరికీ వస్తాయని, ఎవరూ చింతించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీలో ఎవైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, ప్రకాశ్‌గుప్తా, ఎజాస్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' సమరం!



సర్ధార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- సర్పంచ్ అభ్యర్థుల ఎంపికకు యత్నాలు, బుజ్జగింపుల్లో నేతలు
- మొదలైన గ్రూప్ రాజకీయాలు
- మండలంలో మొత్తం 41 పంచాయతీలు
- 48,318 మంది ఓటర్లు

షాబాద్: మండలానికి సంబంధించి సర్పంచ్‌ల రిజర్వేషన్లు కొలిక్కి రావడంతో గ్రామాల్లో అప్పుడే పంచాయతీల ఎన్నికల సమరం మొదలైంది. అధికారులు మండలానికి ఖరారైన రిజర్వేషన్ల వివరాలను అధికారికంగా ప్రకటించడంతో ఆయా పార్టీల నాయకులు కొన్నిచోట్ల అభ్యర్థుల కోసం వేటను ప్రారంభించారు. మరికొన్ని చోట్ల అప్పుడే బుజ్జగింపుల పర్వం మొదలైంది. గతంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు వెలువడే వరకు ఎవరు ఎన్నికలను పట్టించుకునే దాఖలాలు ఉండకపోయేది. కానీ ప్రస్తుతం యువకుల నుంచి మొదలుకొని రాజకీయంలో కొనసాగుతున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సైతం పోటీచేసేందుకు ఆసక్తిని కనబరుస్తూ ముందుకువస్తున్నారు.

ఓటర్ల వివరాలు

షాబాద్ మండలంలో 41 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 3,052 వార్డులకు గాను 24,109 స్త్రీలు, 24,208 పురుషుల ఓటర్లు ఉన్నారని ఎంపీడీఓ అపర్ణ తెలిపారు.

యువకులకే ప్రాధాన్యం

గ్రామాల్లో సర్పంచ్‌ల అభ్యర్థుల ఎంపికకు గత రెండు రోజులుగా నాయకుల్లో గ్రూప్ రాజకీయాలు మొదలయ్యాయి. రాజకీయ నాయకులతో పాటు ప్రమేయం లేని వ్యక్తులు సైతం ముందుకు వస్తూ తమకు అనుకూలంగా ఉన్న ప్రజలతో రహస్య సమావేశాలను ఏర్పరుచుకుంటూ చర్చలు కొనసాగిస్తున్నారు. ఇంకొన్ని గ్రామాల్లో విందుల్లో ముంచెత్తారు. ఏదేమైనా ఈ ఎన్నికల్లో అధికశాతం యువనేతలకే ప్రాధాన్యత కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రిజర్వేషన్ వివరాలు..

మండలంలో మొత్తం 41 గ్రామ పంచాయతీల్లో వివరాలు ఇలా ఉన్నాయి. 1.మద్దూర్ ఎస్టీ(మహిళ), 2.చర్లగూడ ఎస్సీ(జనరల్), 3.ఏట్లఎర్రవల్లి ఎస్సీ(జనరల్), 4.గొల్లూర్‌గూడ ఎస్సీ(మహిళ), 5. హైతాబాద్ ఎస్సీ(జనరల్), 6.మాచన్‌పల్లి ఎస్సీ(మహిళ), 7.పోతుగల్ ఎస్సీ(జనరల్), 8.సీతారాంపూర్ ఎస్సీ(మహిళ), 9. తిర్మలాపూర్ ఎస్సీ(మహిళ), 10. షాబాద్ ఎస్సీ(జనరల్), 11. అంతారం బీసీ(జనరల్), 12. బొబ్బిలిగామ బీసీ(జనరల్), 13. తాళ్లపల్లి బీసీ(మహిళ), 14. బోడంపహాడ్ బీసీ(మహిళ), 15. చందనవెళ్లి బీసీ(మహిళ), 16. కక్కులూర్ బీసీ(జనరల్), 17.లక్ష్మరావుగూడ బీసీ(జనరల్), 18. నరెడ్లగూడ బీసీ(మహిళ), 19.పెద్దవేడు బీసీ(మహిళ), 20.రేగడిదోస్వాడ బీసీ(మహిళ), 21. సోలీపేట్ బీసీ(జనరల్), 22. కేసారం బీసీ(మహిళ), 23.కేశవగూడ బీసీ(జనరల్), 24.ఎల్గొండగూడ బీసీ(జనరల్), 25. నాగర్‌కుంట బీసీ(జనరల్), 26. మన్‌మర్రి బీసీ(జనరల్), 27. లింగారెడ్డిగూడ బీసీ(జనరల్), 28.అప్పారెడ్డిగూడ (జనరల్), 29.దామర్లపల్లి జనరల్(మహిళ), 30. కొమరబండ జనరల్(మహిళ), 31.కుమ్మరిగూడ జనరల్, 32.కుర్వగూడ జనరల్, 33. మక్తగూడ జనరల్(మహిళ), 34.మల్లారెడ్డిగూడ జనరల్(మహిళ), 35.ముద్దెంగూడ జనరల్(మహిళ), 36. నాగర్‌గూడ జనరల్ (మహిళ), 37. పోలారం జనరల్, 38.రుద్రారం జనరల్, 39. సంకెపల్లిగూడ జనరల్(మహిళ), 40.సర్ధార్‌నగర్ జనరల్, తిమ్మారెడ్డిగూడ జనరల్‌కు రిజర్వు చేశారు.

అభ్యర్థుల ఎంపికపై కసరత్తు!

- స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు
- పోటీ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు
- అన్ని స్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధం



ఎంపీడీఓ కార్యాలయం

కొత్తూరు: ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పల్లెల్లో రాజకీయాలు వేడెక్కాయి. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు ఆశావహులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దానికి తోడు బీజేపీ సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నిచోట్ల అభ్యర్థులను బరిలో దింపడానికి సిద్ధమవుతోంది. మూడు పార్టీలు జెడ్పీటీసీ, ఎంపీపీతో పాటు అధిక స్థానాల్లో సర్పంచ్‌లను కైవసం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు.

ముఖ్య నాయకులతో సమావేశాలు

ఇటీవల విడుదలైన ఎన్నికల గెజిట్ మేరకు జెడ్పీటీసీ ఎస్టీ, ఎంపీపీ ఎస్టీ మహిళగా ఉంది. దీంతో కచ్చితంగా రెండు స్థానాలను కైవసం చేసుకోవడానికి ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో అచీతూచి వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రెండు స్థానాలకు అన్ని పార్టీలు ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థులను గుర్తించి వారిలో ఒకరిని ఫైనల్ చేసేందుకు చర్చలు జరుపుతున్నారు. రిజర్వేషన్ల వారీగా ఇప్పటికే పదవులను ఆశిస్తున్న నాయకులు, అభ్యర్థులు పార్టీల్లో ప్రధాన నాయకులతో సమావేశమవుతున్నారు.

ఓటర్లు, స్థానాలు ఇలా..

గ్రామ పంచాయతీలు	12
అనుబంధ గ్రామాలు	09
మొత్తం ఓటర్లు	16,813
పురుషులు	8,454
మహిళలు	8,358
ఇతరులు	01
ఎంపీటీసీ స్థానాల సంఖ్య	06
జెడ్పీటీసీ స్థానాలు	01
పంచాయతీ వార్డులు	110
పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు	110

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామానికి వశిష్ఠ విద్యాసంస్థల చైర్మన్ మ్యాతరి అశోక్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా గడ్డమీది నర్సింలు, మన్‌మర్రి యాదయ్య, చర్ల రాజు, బోడ వెంకటయ్య, షాబాద్ సత్యనారాయణ, మ్యాతరి స్వామి, చర్ల రాఘవేందర్, కూతురు పెద్దఆంజనేయులు, కే.సురేష్, కలాల్ దేవేందర్‌గౌడ్‌తో పాటు పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కేఎస్ రత్నం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. షాబాద్ గడ్డ.. బీజేపీ అడ్డాగా కావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రుణమాఫీ, గ్యాస్‌సబ్సిడీ, మహిళ పింఛన్లు, రాజీవ్ యువశక్తి వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా మారిందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యకర్తలకు సలహాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రతీ కార్యకర్త శ్రమిస్తే విజయాన్ని అందుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, నాయకులు మల్లేశ్, వివేక్‌గౌడ్, నరేశ్, శ్రీశైలం, హరికృష్ణ, మల్లేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, నవీన్, నందు తదితరులు ఉన్నారు.

ప్రజావీరుడు పండుగ సాయన్న



విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చేవెళ్ల: బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం కోసం పండుగ సాయన్న చేసిన కృషి మరువలేనిదని మండల ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విగ్రహ ఆవిష్కరణ చేసి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఊరడి నర్సింలు, యువజన అధ్యక్షుడు తెలుగు శ్రీనివాస్, నాయకులు శివరాజ్, రాంప్రసాద్, వెంకటేశ్, గోపాల్, గణేశ్, బాలయ్య, శ్రీనివాస్, భిక్షపతి, అంజయ్య, జనార్ధన్, నర్సింలు ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి సమన్వయంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలానికి చెందిన నాయకులు, చేవెళ్ల నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో బాకారం గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ నారాయణపు మహేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోవిందమ్మ, డైరెక్టర్లు

శంకర్‌పల్లి: మార్కెట్ కమిటీ కార్యవర్గంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, వాటిని నిరూపిస్తే రాజీనామాకైనా సిద్ధమని శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ స్పష్టం చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డైరెక్టర్లతో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఇటీవల ఎంతో రాజకీయ అనుభవం ఉన్న పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు తాము స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు రూ.30 లక్షలు, డైరెక్టర్లు రూ.20 లక్షలు చెల్లించి పదవులు పొందామని ఆరోపించారన్నారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వారి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం మర్యాదగా వ్యవహరిస్తున్నామని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా గత 12ఏళ్ల కాలంలో ఎమ్మెల్యేగా యాదయ్య ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి, నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ప్రశాంత్, సర్తాజ్, శ్రీహరి, సంతోష్, శేఖర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముట్టి కేజీ తీయాలని తీర్మానిస్తాం

ఉల్లి, కూరగాయలపై ముట్టి 4 కేజీల నుంచి 5 కేజీలు తీస్తుండడంతో ఇప్పటికే పలుమార్లు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే తాజాగా మార్కెట్ కమిటీ ఉల్లిపై క్వింటాల్‌కి ముట్టి కేవలం కిలో, కూరగాయలపై అరకిలో మాత్రమే తీసేలా నిర్ణయం తీసుకున్నారు. త్వరలో దీనిపై తీర్మానం చేసి, ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తామని చైర్‌పర్సన్ గోవిందమ్మ స్పష్టం చేశారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

- ఆందోళనలో స్థానికులు
- కూల్చివేసి, నూతనంగా నిర్మించాలని వినతి



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

మొయినాబాద్: నలభై ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ పిల్లర్లు, బీమ్‌ల పెచ్చులూడి పోయి ఇనుప రాడ్లు తేలాయి. అయినా ఇప్పటికీ దానిలో నీటిని నింపుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకులో నుంచి నీళ్లు లీకవుతున్నాయి. ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్‌ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని.. లేదంటే పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని.. ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకును తొలగించాలని కోరుతున్నారు.

శిశుమందిర్‌లో 'అలయ్ బలయ్'



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రముఖులు

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలు రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు వ్యక్తులను మరింత దగ్గర చేసేందుకు ఉపయోగపడుతాయని, ప్రతి సంవత్సరం ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డా.సంపత్ కుమార్, ఉపాధ్యాయులు రఘునందన్ రెడ్డి, తాహేర్ అలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు వెలుగులు

- నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు
- పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతూనే ఉంది. రాత్రి సమయాల్లో గ్రామాల్లో వెలుతురు కోసం ఏర్పాటు చేసిన వీధిదీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. వాటికి కొన్ని గ్రామాల్లో ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో, మరికొన్ని ప్రాంతాల్లో స్విచ్‌లు ఉన్నా ఆఫ్ చేయకపోవడంతో కరెంట్ ఉన్నంతసేపు విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని బాకారం, శ్రీరాంనగర్, మేడిపల్లి, చందానగర్, టోల్‌కట్ట, చిన్నమంగళారం తదితర గ్రామాల్లో వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు వెలుగుతున్నాయి. వీధి దీపాల నిర్వహణను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బాకారం గ్రామ పంచాయతీపై పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్



బాకారం ఎస్సీ కాలనీలో వెలుగుతున్న వీధిలైట్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ చైతన్య కళాశాలలో 2007–09లో ఇంటర్ అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట కలిసి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం పాఠాలు బోధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కరుణాకర్, ఉపాధ్యాయులు వర్ధన్‌రెడ్డి, అంజలి, భవానీ, కృష్ణమోహన్, శ్రీధర్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వారు.. పనులు మరిచారు

- దారి లేక టేకులపల్లి వాసులకు తప్పని ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



వంతెన నిర్మాణం కోసం తవ్విన టేకులపల్లి రోడ్డు

కొందుర్గు: ఉత్తరాసిపల్లి–టేకులపల్లి దారిలో నూతనంగా వంతెన నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టర్ ఉన్న రోడ్డు తవ్వారు. కానీ ప్రత్యామ్నాయంగా దారి ఏర్పాటు చేయలేదు. దీంతో టేకులపల్లి గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యామ్నాయం లేక..

టేకులపల్లి గ్రామంలో దాదాపుగా 300 కుటుంబాలకు సంబంధించి 1000 మంది వరకు ప్రజలు జీవనం సాగిస్తారు. ప్రతిరోజు వివిధ పనులపై ఈ గ్రామం నుంచి 500ల మంది వరకు ఇతర గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. అదేవిధంగా 50 మందికి పైనే విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ముట్పూర్, షాద్‌నగర్ వెళ్తారు. అయితే టేకులపల్లి–ఉత్తరాసిపల్లి మధ్యన గల వాగుకు ఉన్న పాత వంతెనను నూతనంగా హైలెవల్ వంతెన నిర్మించేందుకు కాంట్రాక్టర్ పదిహేను రోజుల క్రితం రోడ్డు తవ్వేశారు. వంతెన పూర్తయ్యేవరకు సదరు కాంట్రాక్టర్ తాత్కాలికంగా దారి ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. కానీ ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఏదైనా పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాలంటే దాదాపు 20 నుంచి 30 కిలోమీటర్లు అదనంగా తిరిగి షాబాద్ నుంచి వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తరాసిపల్లి, ముట్పూర్ గ్రామాలకు వెళ్లాలన్నా 15 కిలోమీటర్లు అదనంగా తిరిగి రావాల్సి వస్తోందంటున్నారు. కనీసం పక్కనుంచి వెళ్లడానికి కాలిదారి సహితం సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.